# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **సిద్ధాంత కర్తలు మన దేశానికి డిజిటల్ రంగంలో రాయబారులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2.** **హైదరాబాద్ మహా నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, పాతబస్తీ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిపెడతామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు.**

3. **దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక ఛార్టెర్డ్ అకౌంటెంట్-సీఏ పరీక్షలు ఇక నుంచి ఏడాదికి మూడుసార్లు నిర్వహించనున్నారు.**

**4.** **మహాశివరాత్రిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రముఖ శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి.**

**5.** **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు మరో వందేభారత్ రైలు అందుబాటులోకి రానుంది.**

==========================

'కంటెంట్ క్రియేటర్లు' మన దేశానికి డిజిటల్ రంగంలో రాయబారులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'నేషనల్ క్రియేటర్స్' (జాతీయ సృష్టికర్తల) పురస్కారాలను నిన్న ఢిల్లీలోని భారత మండపంలో ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వంపై ప్రపంచానికి సృజనాత్మకంగా చాటిచెప్పడానికి 'క్రియేట్ ఆన్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించాలని సూచించారు. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల భాషలైన జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్ తదితర భాషల్లోనూ కంటెంట్ క్రియేటర్లు సమర్పణలు చేయగలగాలని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

--------------------------

దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక ఛార్టెర్డ్ అకౌంటెంట్-సీఏ పరీక్షలు ఇక నుంచి ఏడాదికి మూడుసార్లు జరగనున్నాయి. ఇప్పటివరకు సంవత్సరానికి రెండుసార్లు.. మే/జూన్‌లో ఒకసారి, నవంబరు/డిసెంబరులో మరోసారి నిర్వహిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం(2024-25) నుంచి సీఏ ఫౌండేషన్, ఇంటర్ పరీక్షలను మూడుసార్లు నిర్వహించాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) నిర్ణయించినట్టు ఆ సంస్థ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా  వెల్లడించారు.

--------------------------

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నిన్న తెలంగాణాలోని ఉమ్మడి వరంగల్‌లో పర్యటించారు. వేయిస్తంభాల గుడిలో పునర్నిర్మించిన కల్యాణమండపం, ములుగులోని జాకారంలో గిరిజన విశ్వవిద్యాలయం క్యాంపు కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. అనంతరం రామప్ప ఆలయాన్ని సందర్శించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రుద్రేశ్వరుడికి కిషన్‌రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకతీయులు అద్భుతమైన ఆలయాలు నిర్మించారని అన్నారు. ప్రసాద్ పథకంలో భాగంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఈ సందర్భంగా కేంద్రమంత్రి పరిశీలించారు.

---------------------------

హైదరాబాద్ మహా నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, పాతబస్తీ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిపెడతామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2050 విజన్‌తో పాతబస్తీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని.... హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఎంఐఎం పార్టీతో కలసి పనిచేస్తామని చెప్పారు. ఆయన నిన్న ఫలక్‌నుమా ఫారూక్‌నగర్‌లో పాతబస్తీ మెట్రోరైల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ... కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ చేపట్టామని.. హైదరాబాద్‌లో పూర్తిస్థాయిలో మెట్రోరైల్ విస్తరిస్తే సామాన్య ప్రజలకు వెసులుబాటుగా ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

కాగా.. హైదరాబాద్ జంట నగరాలతోపాటు ఉత్తర తెలంగాణలోని ఐదు జిల్లాల ప్రజలకు ప్రయోజనకరమైన 'డబుల్ డెక్కర్ కారిడార్' కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈరోజు శంకుస్థాపన చేయనున్నారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై దశాబ్దాలుగా వాహనదారులు ఎదుర్కొంటున్న కష్టాలకు దీనితో ఉపశమనం లభించనుంది. 15 వందల 80 కోట్ల రూపాయలతో 5.32 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించి.. దీనిపైన మెట్రోరైల్ మార్గాన్ని ఏర్పాటు చేస్తారు.

---------------------------

మహాశివరాత్రిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రముఖ శైవక్షేత్రాలు నిన్న శివనామస్మరణతో మార్మోగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. నంద్యాల జిల్లా శ్రీశైలంలో మల్లన్నకు సంప్రదాయబద్ధంగా తల పాగాలంకరణ, పల్నాడు జిల్లా కోటప్పకొండలో భారీ విద్యుత్ ప్రభల ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేష అభిషేకాలు జరిపారు. శ్రీశైలంలో శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల లింగోద్భవ దర్శనం ప్రారంభం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో దర్శనానికి బారులుతీరారు. తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లు ఇంద్ర విమానం, చప్పరంపై పురవీధుల్లో విహరించారు.

కోటప్పకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున రెండు గంటలకు బిందె తీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ప్రభల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని రామతీర్థానికి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు పోటెత్తారు. రామకోనేరు గట్టు, కల్యాణ మండపం, నీలాచలగిరి పరిసర ప్రాంతాల్లో కాగడాలు వెలిగించి రాత్రంతా జాగారం చేశారు. విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో 39వ మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు.

---------------------------

తెలంగాణలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి, కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయాలకు మహాశివరాత్రి సందర్భంగా లక్షల మంది భక్తులు తరలివచ్చారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. గర్భగుడిలో మూలవిరాట్టుకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అద్దాల మండపంలో మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. మట్టితో రూపొందించిన 366 లింగాలను 15 ఆవరణాలుగా పేర్చి, ప్రాణప్రతిష్ఠ చేసి పూజించారు. గుడి చెరువు పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు జాగారం చేసే భక్తులను అలరించాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ప్రయాణికులకు మరో వందేభారత్ రైలు అందుబాటులోకి రానుంది. తూర్పు కోస్తా రైల్వే జోన్‌లోని భువనేశ్వర్ లేదా ఖుర్దా రోడ్ నుంచి విశాఖపట్నం వరకూ ఈ రైలును నడపనున్నారు. దీని రంగు ప్రస్తుత వందేభారత్‌లకు భిన్నంగా.. తెలుపు-నీలం రంగు కాకుండా నలుపు-ఆరెంజ్ రంగు కలిగి ఉంది. నిన్న ఈ రైలుకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ నెల 12న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృశ్యమాధ్యమం ద్వారా ఈ రైలును ప్రారంభిస్తారని రైల్వే వర్గాలు తెలిపాయి.

---------------------------

స్వాతంత్ర్య సమరయోధులు, బహు భాషావేత్త బెజవాడ గోపాల రెడ్డి వర్ధంతి ఈరోజు. ఆంధ్ర రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగాను, ఉత్తరప్రదేశ్‌కు గవర్నర్‌గాను సేవలందించిన ఆయన... నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో 1907 ఆగష్టు 7వ తేదీన జన్మించారు. 11 భాషల్లో పండితులైన గోపాల రెడ్డి అనేక పుస్తకాలు రచించారు. పరిపాలనా దక్షుడిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రి పదవులు కూడా నిర్వహించిన ఆయన... సాహితీ రంగంలో కూడా చిరస్మరణీయమైన సేవలందించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గీతాంజలి, ఊర్వశి వంటి పలు రచనలను తెలుగులోకి అనువదించిన గోపాల రెడ్డి 1997 మార్చి 9వ తేదీన కన్నుమూశారు.

---------------------------

ప్రముఖ విద్యావేత్త, ఇన్ఫోసిస్ సంస్థ సహ వ్యవస్థాపకుడు పి.నారాయణ మూర్తి సతీమణి సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమెను ఎగువసభకు నామినేట్ చేసినట్లు తెలిపారు. పలు రంగాల్లో సుధామూర్తి చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా ప్రధానమంత్రి కొనియాడారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్యతోపాటు విభిన్న రంగాల్లో సుధామూర్తి చేసిన కృషి అపారమని, స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఆమె రాజ్యసభకు రావడం 'నారీశక్తి'కి బలమైన నిదర్శనమని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణాలో ప్రయోగాత్మకంగా 20 వేల వ్యవసాయ మోటార్లకు సౌరవిద్యుత్ ఏర్పాటుకు పీఎం కుసుమ్ పథకంలో రాయితీ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణలో 29 లక్షల వ్యవసాయ బోర్లకు సాధారణ విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. వీటికి రోజుకు 10 కోట్ల యూనిట్లకు పైగా విద్యుత్‌ను డిస్కంలు సరఫరా చేస్తున్నాయి. కుసుమ్ పథకంలో భాగంగా 'కాంపొనెంట్ సి' విభాగం కింద ఒక్కో బోరుకు 5 కిలోవాట్ల సామర్థ్యంతో సౌరఫలకాల ఏర్పాటుకయ్యే వ్యయంలో 30% రాయితీ ఇస్తామని కేంద్రం తెలిపింది. ఇప్పటికే ఉన్న బోర్ల వద్ద సౌరఫలకాల ఏర్పాటుకు ఈ రాయితీ ఇస్తారు.

=====================